నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

3 | మహబూబ్‌నగర్, శుక్రవారం 28 జూన్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లి లో గురువారం మర్యాదపూర్వకంగా పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, కొత్తకోట ఎంపీపీ గుంత మౌనిక, వైస్ఎంపీపీ శ్రీనివాసులు, వెల్దండ మండలం అజిలాపూర్‌కు చెందిన రమేశ్‌గౌడ్, చిన్నంబావి మండలానికి చెందిన ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, ప్రశాంత్, మల్లేశ్ ఇతర నాయకులు గులాబీ బాస్‌ను కలిశారు.

కొత్తకోట/వెల్దండ/చిన్నంబావి, జూన్ 27

పదేండ్లు ధోకా లేకుండే..

తెలంగాణ రాకముందు రాత్రి, పగలు తేడా లేకుండా కరెంట్ కోతలుండేవి. రాత్రింబవళ్లు బావులకాడికి పోయి చేన్లకు నీళ్లు పారిచ్చేటోళ్లం. పంటలు ఎండిపోతుంటే ధర్నాలు కూడా చేసినం. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక ఆ పరిస్థితి లేదు. కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తానని చెప్పినట్టుగానే ఇచ్చిండు. మన దగ్గర సరిపోయేంత కరెంట్ లేకపోతే వేరే రాష్ట్రాల నుంచి కొని ఇచ్చిండు. దాంతో పొద్దుందాకనే చేన్లకు నీళ్లు పారిచ్చుకున్నాం. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏరోజు కూడా రాత్రిపూట బాయికాడికి పోయి నీళ్లు పెట్టలే. తెలంగాణ వచ్చినంకనే సరిపోయేంత కరెంట్ వచ్చింది. కరెంట్ లేక పంటలు ఎండిపోయిన ఘటనలు అయితే లేవు. పదేండ్లు కరెంట్, నీళ్లకు ధోకా లేకుండా పంటలు పండించుకున్నం. ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయం చేద్దామంటే భయమయ్యేలా చేస్తున్నది. కరెంట్ ఎప్పుడు వస్తదో? ఎప్పుడు పోతదో తెలుస్తలేదు.

- గంగ, యువ రైతు, పెద్దదగడ, చిన్నంబావి మండలం

- కేసీఆర్ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్
- కాంగ్రెస్ హయాంలో కోతల కరెంట్
- కన్నెర్ర చేస్తున్న రైతులు, వ్యాపారులు

నాడు జిగేల్.. నేడు వెతల్

పనులు ఆగుతున్నయి..

కరెంట్ ఉంటేనే మా పనులు సాగుతయి. అది సక్కగుంట లేదు. పోతే ఎప్పుడొస్తదో తెల్వదు. సారోళ్లకు ఫోన్ చేస్తే పైనుంచి పోయిందని చెప్తున్నరు. పనులేమో ఆగిపోతున్నయి. మా సంపాదనంతా కరెంట్ పైనే ఆధారపడి ఉంది. కరెంట్ లేక వచ్చినోళ్లంతా వెనక్కిపోతున్నరు. చాలా ఇబ్బందులు పడుతున్నం. అప్పుడు (బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో) కరెంట్ మంచిగుండే. అస్సలు పోకపోయేది. మా పనులు ఆగేవి కాదు. కాంగ్రెస్ వచ్చినాకనే మాకు తిప్పలు మొదలయ్యాయి. ఈ కష్టాలు ఎప్పుడు తీరుతయో..

- బంగారం, లేత్‌మిషన్ నిర్వాహకుడు, తిమ్మాజిపేట

రైతులు కేసీఆర్‌ను మరిచిపోరు..

2014కు ముందు చిన్నంబావి మండలం అస్తవ్యస్తంగా ఉండే. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక కేసీఆర్ సార్ మండలంగా ప్రకటించిండు. అంతేకాకుండా సాగునీటిని తీసుకొచ్చిండు. మండల రైతాంగానికి సాగునీరు, ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. రాత్రిపూట కరెంట్‌తో ప్రమాదాలు జరుగుతాయని, ఉదయం పూట కూడా సరఫరా చేసి మర్చిపోలేని సాయం చేసిండు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అన్నదాతలు విషపురుగులు బారిన పడడం, విద్యుత్ షాక్‌లకు గురికావడం నిలిచిపోయాయి. రైతులు ఆయనను ఎప్పుడూ మరిచిపోరు. మంచి చేసిన కేసీఆర్‌పై నిందనలు వేయొద్దు. ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ పదేండ్ల కిందటి పాలనను గుర్తుకు తెస్తున్నది. పంటలు పండుతాయన్న నమ్మకమైతే లేదు.

- రామకృష్ణ, రైతు, కొప్పునూర్, చిన్నంబావి మండలం

నిండుకుండలా కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్

నిండుకుండలా కోయిల్‌సాగర్

- 15 అడుగులకు చేరిన నీటిమట్టం

దేవరకద్ర, జూన్ 27 : కోయిల్‌సాగర్‌కు జూరాల నుంచి కృష్ణాజలాలు వస్తుండటంతో గురువారం ప్రాజెక్టు నీటిమట్టం 15 అడుగులకు చేరింది. కోయిల్‌సాగర్ నిల్వ సామర్థ్యం 32.5 అడుగులు కాగా.. 17.5 ఫీట్లకు నీరు చేరితే షెట్టర్లను తెరుస్తారు. కాగా వరద రాకతో కోయిల్‌సాగర్ జలకళను సంతరించుకున్నది. ప్రాజెక్టులో రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొండారెడ్డిపల్లిలో వరదపాశం

బల్మూరు, జూన్ 27 : మండలంలోని కొండారెడ్డిపల్లిలో గురువారం గువ్వకుంట వద్దనున్న తూంబండపై వరద పాశం పోశారు. 15 రోజులుగా వర్షం కురవకపోవడంతో గ్రామస్తులంతా చందాలు వేసుకొని ప్రసాదం తయారుచేశారు. వరదపాశాన్ని గ్రామంలో భజన చేస్తూ ఊరేగించి కుంట వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన యాదవ కులస్తులు బండపైన పోసిన పాశాన్ని నాలుకతో తాగారు. త్వరగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని వరుణుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పంబ రాధాకృష్ణ, వెంకటయ్య, వెంకటేశ్, తిరుపతయ్య, వెంకట్‌స్వామి, నిరంజన్ తదితరులున్నారు.

కొండారెడ్డిపల్లిలో వరదపాశం తాగుతున్న గ్రామస్తులు

నేడు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి ఆత్మీయ సన్మానం

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 27 : నాగర్‌కర్నూల్ శివారులోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద ఉన్న వైభవ్ గార్డెన్‌లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సభాధ్యక్షులుగా మర్రి, ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.



సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉన్నది. వానకాలం ప్రారంభం కావడంతో పల్లెలు, పురపాలికల్లో పారిశుధ్య సమస్య ఏర్పడింది. వాతావరణంలో మార్పులతో జిల్లాలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియాతోపాటు పలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నది. ఈ తరుణంలో ముందస్తుగా అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలి. కానీ కాంగ్రెస్ హయాంలో ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ అమలు కావడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం ముందస్తు చర్యలతో గతంలో చేపట్టిన పల్లె, పట్టణ ప్రగతితో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇండ్ల మధ్య పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు పెరగడం, మురుగు పేరుకుపోయి పారిశుధ్యం కొరవడింది. వాన నీరు నిల్వతో దోమలు, ఈగల ఉధృతి పెరిగింది. ఫలితంగా ప్రజల్లో సీజనల్ రోగాల భయం నెలకొన్నది.

– నాగర్‌కర్నూల్, జూన్ 27 (నమస్తే తెలంగాణ)

పారాహుషార్!

- పొంచిఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- ఇండ్ల మధ్యన పిచ్చిమొక్కలు, కొరవడిన పారిశుధ్యం
- విజృంభిస్తున్న దోమలు
- వానకాలం వస్తున్నా కానరాని కార్యాచరణ
- పట్టింపులేని ప్రభుత్వం
- పల్లెల్లో మొక్కుబడిగా 'ప్రత్యేక' పాలన
- కేసీఆర్ ప్రభుత్వంలో పల్లె, పట్టణ ప్రగతితో సీజనల్ రోగాలు దూరం

సీజనల్‌పై సమరమేదీ..?

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

గ్రామాలు, పురపాలికల్లో సీజనల్ రోగాల ముప్పు పొంచి ఉన్నది. వానకాలం రావడంతో పారిశుధ్యం కొరవడనున్నది. గతేడాదికంటే ముందుగా ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో ఇండ్ల మధ్యనే పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. అలాగే రోడ్లు, ఖాళీ జాగాల్లో నిలిచిన నీటితో బురదమయంగా మారాయి. ఇక గ్రామ శివారు ప్రాంతాల్లోనూ ఆపరిశుభ్రత నెలకొన్నది. దీంతో దోమలు, చిన్నచిన్న క్రిములు, ఈగలు పెరిగి స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు సాయంత్రమైందంటే ప్రజల రక్తాన్ని పీల్చుతున్నాయి. ఇక పంచాయతీ, పురపాలికల అధికారులు ఫాగింగ్ చేపట్టడం లేదనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ కారణంగా వానకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, విరేచనాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది. ఇప్పుడిప్పుడే వర్షాలు ప్రారంభం కావడంతో ముందస్తుగా చర్యలు తీసుకోకుంటే ప్రజలు అనారోగ్యంగా ఉండే పరిస్థితులు ఉన్నాయి. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు పారిశుధ్య చర్యలు తీసుకునేందుకు ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. గ్రామాల్లో సర్పంచుల పదవులకు ఎన్నికలు లేకపోవడంతో ప్రత్యేకాధికారులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేక అధికారులు గ్రామాల్లో మంచినీరు, విద్యుత్, పారిశుధ్య పనులు నిర్వహించలేకపోతున్నారు. ఇప్పటి వరకూ ఎన్నికల కోడ్‌తోనే ఉన్న అధికారులు తాజాగా బదిలీలకు పైరవీలు చేసే పనిలో బిజీబిజీగా ఉన్నట్లు తెలిసింది. ఈ కారణాలతో పారిశుధ్యం 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా తయారైంది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న చర్యలతో సీజనల్ వ్యాధులు దూరమయ్యాయి. ప్రతి సంవత్సరం రెండుసార్లు పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో భాగంగా గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇండ్ల మధ్య మురుగు గుంతలు లేకుండా మట్టి వేసి చదును చేశారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పాత ఇండ్లను కూల్చడం, రోడ్ల వెంట మొలిచిన పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లను జేసీబీలతో తొలగించడం, నీళ్ల ట్యాంకులను, మురుగు కాల్వలను శుభ్రం చేయడం, క్లోరినేషన్‌లాంటి చర్యలు చేపట్టారు. దీంతో పారిశుధ్య సమస్య తీరడం, సీజనల్ రోగాలు క్రమేణా తగ్గుతూ వచ్చాయి. కాగా ప్రస్తుతం అలాంటి చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. దీనివల్ల గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య సమస్య ప్రధానంగా మారింది. దోమలతో పాటుగా ఈగలు, పందులు, కుక్కలు బెడద ఎక్కువైంది. ఇక పిచ్చిమొక్కలు పెరగడం తో రాత్రిళ్లు ప్రజలకు పాములు, తేళ్ల బెడద నెలకొన్నది. పట్టణ ప్రాంతాల్లోనూ విషసర్పాలు సంచరిస్తూ ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇక ప్రధానంగా నీళ్ల ట్యాంకులు శుభ్రపర్చడం మరిచారు. ఇక వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా కేవలం శుక్రవారం మాత్రం డ్రై డే మొక్కుబడిగా నిర్వహిస్తూ అధికారులు మమ అనిపిస్తున్నారు. ఇక గ్రామాల్లో ప్రజలకు సీజనల్ రోగాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం లేదు. గ్రామాలకు తిరిగి వైద్యఆరోగ్య శాఖ దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. దోమలు వృద్ధిచెందకుండా మందులను అందించాల్సి ఉంది. కేసీఆర్ పాలనలో జిల్లాలోని నల్లమల ప్రాంతంలో పదేళ్లలో చెంచులకు సీజనల్ రోగాల ముప్పు లేకుండా పోయింది. ఇప్పుడు ఎలాంటి కార్యాచరణ కనిపించకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతున్నది. వానకాలం రావడంతో చెంచులకు దోమ తెరలను పంపిణీ చేయాల్సి ఉన్నది. మొత్తంమీద బీఆర్ఎస్ హయాంలో సీజనల్‌పై ముందస్తు సమరం చేపట్టగా ఇప్పుడు ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోవడంతో ప్రజలకు సీజనల్ రోగాల భయం నెలకొన్నది.

తగ్గిన సీజనల్ వ్యాధుల వివరాలు

వ్యాధి	2018	2019	2020	2021	2022	2023	2024
డెంగీ	36	134	20	114	45	13	05
చికున్‌గున్యా	07	18	03	00	00	00	00
మలేరియా	05	07	02	01	00	02	01
ఫైలేరియా	122	00	00	00	00	00	00
స్వైన్‌ఫ్లూ	03	06	01	00	00	00	00

బీఆర్ఎస్ పాలనలో తగ్గిన కేసులు

జిల్లాలో పదేళ్లలో డెంగీ కేసులు తప్పా ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రభావం చూపించలేదు. ఫైలేరియా కేసులు 2018లో 122 నమోదు కాగా ఆ తర్వాత ఒక్కరికీ ఈ వ్యాధి సోకలేదు. గతంలో ఆందోళన కలిగించిన స్వైన్‌ఫ్లూ సింగిల్ అంకెకే పరిమితమైంది. విరేచనాలు 2021లో మాత్రమే 12 కేసులు, 2022లో 18 కేసులు, 2023లో 20 మాత్రమే వెలుగు చూశాయి. టైఫాయిడ్ కేసులు నాలుగేళ్లలో ఐదు మాత్రమే నమోదయ్యాయి. అతిసార కేసులు ఆందోళనకరంగా కనిపించినా వ్యాధి తీవ్రత బాగా తక్కువ. మామూలు లక్షణాలతోనే ప్రజలు కోలుకొన్నారు. నల్లమల అటవీ ప్రాంతాల్లోనూ ఈ వ్యాధులు నమోదు కాకపోతుండటం విశేషం. దోమకాటుతో వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, జపనీస్ ఎన్సెఫాలిటీస్(జేఈ) వ్యాధిగ్రస్తులు సింగిల్ డిజిట్లకే పరిమితమయ్యారు. అలాగే కరోనా కంటే ముందు ఆందోళన కలిగించిన హెచ్-1ఎన్-1 వైరస్ సంక్రమిత స్వైన్‌ఫ్లూ సైతం దూరమైంది. ఇక కలుషిత నీటి సంక్రమిత అతిసార, విరేచనాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులు భారీగా తగ్గుముఖం పట్టాయి. నీళ్ల ట్యాంకుల వద్ద మురుగు తొలగించడం, నీళ్లల్లో బ్లీచింగ్ చల్లడం, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధ జలం సరఫరా జరగడం దీనికి కారణం. ఇలా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతితో సీజనల్ వ్యాధులు దూరమయ్యాయని చెప్పొచ్చు. ఫలితంగా పల్లెలు ఆరోగ్యంగా మారాయి. వీటితో పాటుగా పిచ్చిమొక్కలు, పాడుబడ్డ ఇండ్లు, బావులు తొలగించడంతో పాములు, తేళ్లలాంటి విషపురుగుల సంచారం తగ్గింది. ఈ కారణంగా పాము, కుక్క కాట్లు, పందుల దాడులు అడపాదడపా తప్పా గణనీయంగా తగ్గాయి. ఇలా పల్లె ప్రగతితో గత పదేళ్లలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు దూరమయ్యాయి.

చర్యలు తీసుకుంటాం

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు ప్రబలే శాతం తగ్గుతుంది. పదేళ్లలో సీజనల్ వ్యాధులైన స్వైన్ ఫ్లూ, డెంగీ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ కేసులు తగ్గాయి. ప్రస్తుతం ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. త్వరలో ప్రత్యేకంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వైద్యసిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

- సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌వో, నాగర్‌కర్నూల్

పారదర్శకతే ప్రామాణికం

- జిల్లా దవాఖాన అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు
- ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే క్రిమినల్ కేసులు
- ఎక్సైజ్, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- నాగర్‌కర్నూల్‌లో అధికారులతో సమీక్ష
- హాజరైన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి, రాజేశ్‌రెడ్డి ఎమ్మెల్సీలు కూచకుళ్ల, గోరటి

నాగర్‌కర్నూల్, జూన్ 27 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వారికి గౌరవవంతమైన పాలనను అందించేందుకు అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. గురువారం నాగర్‌కర్నూల్‌లోని ఐడీవోసీ సమావేశ మందిరంలో కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డిలతో కలిసి నీటిపారుదల, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, మెడికల్ కళాశాల, విద్యుత్, పౌరసరఫరాలు, మిషన్ భగీరథ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ.. ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కలిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాపాలనలో పారదర్శకతే ప్రామాణికమని.. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో అధికారులు మర్యాద పూర్వకంగా మసలుకోవాలని సూచించారు. జిల్లా రైతాంగానికి సాగునీరు అందించేందుకు గానూ ప్రాజెక్టులను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అభివృద్ధికి నిధులిస్తామని, ఆయా శాఖల అధికారులు పనుల పురోగతిలో వేగం పెంచాలన్నారు. ఎంజీకేఎల్ఐని వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా రానున్న ఆరు నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. సాగునీటి కాల్వల్లో జమ్ము, చెత్తను తొలగించేందుకు కావాల్సిన ఎస్టిమేషన్ నివేదికలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు నష్టాన్ని రికవరీ చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలిచేలా ధరణి సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా దవాఖాన అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.50లక్షలు విడుదల చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. జిల్లాలోని అన్ని దవాఖానలకు కావాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు సిబ్బందికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. మెడికల్ కాలేజీతోపాటు జిల్లా దవాఖానకు మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ తన వద్దకు వచ్చే రైతుల్లో ఎక్కువ శాతం ధరణి సమస్యలపైనే వస్తున్నారన్నారు. వారి తో తాసీల్దార్లు దురుసుగా ప్రవర్తించకుండా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎన్నికలకు ముందు బిజినేపల్లి మండలంలోని మార్కండేయ ఎత్తిపోతల పథకాన్ని గత ప్రభుత్వం ప్రారంభించిందని, ఏడు నెలలు గడిచినా పురోగతి లేకపోవడం ఏంటి? పనులు జరుగుతాయా? జరగవా? అని అధికారులను ప్రశ్నించారు. రానున్న వారం రోజుల్లో ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తాసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ధరణి ఫిర్యాదుల పరిష్కారానికి రాత్రి 9 గంటల వరకు ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించడంతోపాటు ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేఎల్ఐ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గంలో ఐదు టీఎంసీల నీటి నిల్వ కోసం ఒక రిజర్వాయర్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్ ఏర్పాటు చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని, సేవ్ గవర్నమెంట్ ల్యాండ్స్ అనే నినాదంతో విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. ఎన్నో ఏండ్లుగా సాగుచేస్తున్న నిజమైన వారికే పోడు భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. తన నియోజకవర్గంలో కొత్తగా సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. కేఎల్ఐ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదని, ప్రతిరోజూ రైతులు తనతో వాగ్వాదం చేస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. వారికి త్వరగా పరిహారం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులతో చర్చించి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఇటీవల 200కు పైగా విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని సూచించారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీతారామారావు, చీర్ల శ్రీనివాసులు, జిల్లా అటవీశాఖాధికారి రోహిత్ గోపిడి, అన్నిశాఖల అధికారులు, ఆర్డీవోలు, తాసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

దివ్యాంగులకు అండగా..

దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి జూపల్లి అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా మహిళా శిశు, దివ్యాంగ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని 30 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.20లక్షల విలువ చేసే పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, వంశీకృష్ణ, స్త్రీ శిశు సంక్షేమాధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు బస్సు సౌకర్యం..

జిల్లా మెడికల్ కళాశాలకు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి తన సతీమణి సౌభాగ్యమ్మ పేరుపై బస్సును అందజేశారు. ఈమేరకు గురువారం బస్సును కలెక్టరేట్‌లో మంత్రి ప్రారంభించారు. మెడికల్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం బస్సును అందజేసినట్లు దామోదర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.